APTEL/26A5612

# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు — తెలుగు దినపత్రిక

అనంతపురం | శనివారం 10 అక్టోబర్ 2026 | సంపుటి : 1 | సంచిక : 102 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | పేజీలు : 8 | వెల : 2/-



## ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని భారత్ అనుమతించదు

- ఫ్రీ మార్కెట్‌లో వినియోగదారులు తమకు నచ్చిన సేవలను ఎంచుకుంటారు
- వారికి పలు ఆప్షన్లను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత
- కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా



## నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంతో.. ట్రంప్ అసహనం

- నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ట్రంప్ అసంతృప్తి
- విజేత నవీ పిళ్ళైను విమర్శిస్తూ చేసిన పోస్టును రీషేర్

### జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై

# పవన్ కల్యాణ్ సీరియస్



- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
- బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
- గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
- కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన

**అమరావతి**

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు - మిగతా3లో

- వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ
- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్
- హైకోర్టు ఇచ్చిన 6 వారాల గడువులోపు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది.
- సర్ ప్రక్రియ పూర్తికాకుంటే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం
- వార్డుల పునర్విభజన అడ్డుకోవడం, ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్య

# స్థానిక సమరానికి గ్రీన్ సిగ్నల్



**అమరావతి**

వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "సర్" ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఆ పార్టీ లేవనెత్తిన ఏ విషయాన్నీ అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. హైకోర్టు ఇచ్చిన సమయం ప్రకారం 6 వారాల గడువులోపు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే నోటిఫికేషన్ విడుదలలోపు సర్ ప్రక్రియ పూర్తైతే ఆ జాబితానే ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీకి - మిగతా3లో

## వ్యాపారానికి కాదు, గుత్తాధిపత్యానికే మేము వ్యతిరేకం

- మోదీ సర్కార్‌పై రాహుల్, ఖర్గే తీవ్ర విమర్శలు
- ప్రతి వ్యాపార సంస్థకు సమాన అవకాశాలు ఉండాలి
- రాజకీయ మద్దతుతో సాగే పెట్టుబడిదారీ విధానానికి చరమగీతం పాడాలి



# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



- రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు:
- నర్సింగోలులో చంద్రబాబు ప్రసంగం
- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి–మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

**అమరావతి**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై - మిగతా3లో

## "ఓట్ల దొంగతనం" జరుగుతోంది

- "ఓట్ల దొంగతనం"పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన విపక్షాలు
- ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి కోరినట్లు వెల్లడించిన రాహుల్
- ప్రధాని, హోంమంత్రి, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపణ
- సీఈసీ రాజీనామా చేయాలని, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరపాలని డిమాండ్
- సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిన విపక్ష కూటమి





## నీట్ విధానంలో మరిన్ని సంస్కరణలు

- నీట్ పరీక్ష నిర్వహణలో కీలక మార్పులు చేయాలి
- పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కీలక సిఫార్సులు చేసింది.
- ఇక్కడ ఎన్టీఏ పార్లమెంటుకు (లోక్‌సభ, రాజ్యసభ) జవాబుదారీగా ఉండేలా చట్టపరమైన వ్యవస్థ

### వెలిగొండ పూర్తి ఫలాలు

## అందించేందుకు అడుగులు

- రూ.2,847 కోట్లు ఇస్తే రెండు దశల్లోనూ నీళ్లు
- రూ.941 కోట్లతో తొలిదశ ఆయకట్టుకు నీరు
- తదుపరి పనులపై దృష్టి సారిస్తోంది.
- రూ.14,432 కోట్లకు అంచనాల సవరణ.
- జలజీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా ప్రాజెక్టును వేసవి కాలం నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో అడుగులు



**అమరావతి**

వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెళ్లు పూర్తి చేసి, నల్లమలసాగర్ జలాశయంలో దాదాపు 7 టీఎంసీల నీళ్లు ప్రభుత్వం నింపింది. ఇప్పుడు తదుపరి పనులపైనా దృష్టి సారిస్తోంది. వీటిని పూర్తి చేసేందుకు మరో రూ.2,847 కోట్లు అవసరమని ప్రాథమికంగా లెక్కలు - మిగతా3లో

## జెన్ జీకి భయపడుతున్న కేంద్రం

- అందుకే దిల్లీని కోటలా'– నిరసనల వేళ సీజేపీ విమర్శలు
- రాజధానిలో ఇంటర్నెట్ బంద్!
- సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న దిల్లీ జంతర్ మంతర్ వద్ద సీజేపీ భారీ నిరసనలకు సిద్ధమైంది. తమకు భయపడి కేంద్రం ఆంక్షలు విధిస్తోందని ఆరోపించింది.
- మెట్రో, రైళ్లపై ఆంక్షలు– సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



# రత్నాల సిమగా రాయల రాజధాని..!!

.....సంక్షేమం, అభివృద్ధి....దట్ ఈజ్ కూటమి..!!

--..రాయలసీమను రతనాల సీమగా మార్చడమే అపరభగీరథుడు సీఎం చంద్రబాబు లక్ష్యం

-- గొడ్డలి పార్టీకి రఫా రఫా తప్పా.. అభివృద్ధి అంటే తెలియదు

-- మడకశిర బ్రాంచ్ కెనాల్ సామర్థ్యం 642 క్యూసెక్కులకు పెంపు

-- త్వరలో చాలకూరు చెరువుకి నీళ్లు

-- రూ.790 కోట్లతో మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులను ప్రారంభించిన మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి




# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు

## రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా






# ఉత్తరాల మౌనం.. తపాలా సేవల ప్రస్థానం..

-కాలంతో మారినా.. చెదరని తపాలా బంధం

అక్షరాల అనుబంధం నుంచి ఆధునిక సేవల వరకు

-నేడు జాతీయ తపాలా దినోత్సవం

(మిట్ట మహేష్ సీనియర్ పాత్రికేయులు )

పులివెందుల అక్టోబర్ 9 తెలుగు స్వరం.

ఒకప్పుడు ఆత్మీయుల క్షేమసమాచారాన్ని తెలుసుకోవాలన్నా.. దూరాన ఉన్న బంధువులకు మనసులోని మాటను చేరవేయాలన్నా.. ప్రేమానురాగాలను అక్షరాల్లో నింపి పంపాలన్నా.. అందరికీ గుర్తుకొచ్చేది తపాలా శాఖే. తెల్లటి కాగితంపై నీలి సిరాతో రాసిన ఉత్తరం కోసం ఎదురుచూసిన రోజులు, ఇంటి ముందు తపాలా బంట్రోతు సైకిల్ గంట వినిపించగానే గుమ్మం వైపు పరుగులు తీసిన జ్ఞాపకాలు నేటికీ అనేకమంది మదిలో చెరగని ముద్రలుగా నిలిచిపోయాయి. కాలం మారింది.. సమాచార వ్యవస్థ రూపురేఖలు మారాయి.. అయినా ప్రజలకు సేవలందించడంలో తపాలా శాఖ తనదైన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంది.



**భావోద్వేగాలకు వారధిగా..**

అక్టోబర్ 10న జాతీయ తపాలా దినోత్సవాన్ని జరుపుకుంటారు. భారతదేశంలో తపాలా సేవల ప్రాధాన్యాన్ని గుర్తుచేసుకోవడంతోపాటు, ప్రజల జీవితాల్లో తపాలా శాఖ పోషిస్తున్న పాత్రను స్మరించుకోవడానికి ఈ రోజు ఒక సందర్భం. అక్టోబర్ 9న ప్రపంచ తపాలా దినోత్సవం జరుపుకుంటే, అక్టోబర్ 10ను భారతదేశంలో జాతీయ తపాలా దినోత్సవంగా పాటిస్తారు. గతంలో తపాలా శాఖ అనగానే ఉత్తరాలు, మనియార్డర్లు, టెలిగ్రాములు గుర్తుకొచ్చేవి. ఉద్యోగ నియామక పత్రాలు, పరీక్షల హాల్‌టికెట్లు, శుభలేఖలు, పండుగ శుభాకాంక్షలు, ఆత్మీయుల క్షేమసమాచారాలు.. ఇలా ఎన్నో మధురానుభూతులకు తపాలా సేవలు వేదికగా నిలిచాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తపాలా బంట్రోతుకు ప్రజలతో విడదీయలేని అనుబంధం ఉండేది. ప్రతి ఇంటి చిరునామా తెలిసిన వ్యక్తిగా, సంతోషకరమైన వార్తలతోపాటు విషాద సమాచారాన్ని సైతం చేరవేసే బాధ్యతాయుతమైన సేవకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉండేది.

**కాలంతో పోటీపడుతూ..**

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో సమాచార మార్పిడిలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్, వాట్సాప్, ఈ-మెయిల్ వంటి ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఉత్తరాల వినియోగం గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు రోజుల తరబడి ఎదురుచూసిన సమాచారం ఇప్పుడు క్షణాల్లో చేరుతోంది. అయినప్పటికీ తపాలా శాఖ తన సేవలను విస్తరించుకుంటూ నూతన అవసరాలకు - మిగతా3లో



# బీసీలకు అన్యాయం చేసిన జగన్..!!

....బీసీల రాజకీయ హక్కులపై సమాధానం చెప్పాలి:

.....ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్...

....34 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై వైసీపీ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించిన ఎమ్మెల్యే



కదిరి, నంబులపూలకుంట, అక్టోబర్ 9 తెలుగు స్వరం (బ్యూరో))

బీసీల రాజకీయ భవిష్యత్తుతో చెలగాటమాడిన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, బీసీలకు జరిగిన అన్యాయంపై సమాధానం చెప్పాలని శుక్రవారంకదిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ డిమాండ్ చేశారు. 34 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసిన నేపథ్యంలో, వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలపై ఆయన విమర్శలు చేశారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే విషయంలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలు బీసీ వర్గాలకు నష్టం కలిగించాయని ఆరోపించారు. బీసీలకు అధికారం అంటే పదవులు మాత్రమే కాదు ఆత్మగౌరవం, రాజకీయ గుర్తింపు, సమాన అవకాశాలుబీసీలను ఓటు బ్యాంకుగా చూడటం కాదు, పాలనలో భాగస్వాములను చేయడమే నిజమైన సామాజిక న్యాయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో బీసీలకు జరిగిన నష్టంపై వైసీపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల అభ్యున్నతి గురించి మాట్లాడే నైతిక బాధ్యత వైసీపీ నాయకులకు ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చట్టపరమైన నిబంధనలు, రిజర్వేషన్ల ప్రకారం బీసీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కందికుంట వెంకట ప్రసాద్ స్పష్టం చేశారు. బీసీల హక్కుల పరిరక్షణకు, వారి రాజకీయ ఎదుగుదలకు కూటమి - మిగతా3లో

# రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం..!!

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

సుప్రీంకోర్టులో చివరి వరకూ చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేశాం

కోర్టు తీర్పును గౌరవిస్తాం.. పార్టీపరంగా బీసీలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటాం

బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న జగన్.. గత ఎన్నికల్లోనూ రిజర్వేషన్లకు గొడ్డలి పార్టీ కోత

16,800 పదవులకు దూరమైన బీసీలు

జనాభా ప్రాతిపదికను బీసీలకు పదవులు దక్కాలన్నదే మా అభిమతం : మంత్రి సవిత

పెనుకొండ అక్టోబర్ 9 తెలుగు స్వరం



స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం చిట్టచివరి వరకూ, చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేశామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని, పార్టీ పరంగా వర్తింపజేస్తామని స్పష్టంచేశారు. బీసీలు రాజకీయంగా ఎదగడం జగన్ కు ఇష్టం లేదని, అందుకే ఆయన హైకోర్టులో కేసులు వేసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారని మండిపడ్డారు. శ్రీసత్యసాయిజిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా గుర్తింపు లభించేలా టీడీపీ ప్రభుత్వాలు కృషి చేస్తూ వస్తున్నాయన్నారు. 1987లో మొట్టమొదటి సారిగా స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లను అన్న ఎన్టీఆర్ అందజేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు 1995లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారన్నారు. ఆనాటి నుంచి 2021 వరకూ బీసీలకు రిజర్వేషన్లు అమలవుతూ వస్తున్నాయన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి - మిగతా3లో

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

-మొదటిపేజీ తరువాయి

ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. “మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం” అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకండ్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.



**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్-2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దోనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే ‘పబ్లిక్ ఆడిట్’.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన ‘పబ్లిక్ ఆడిట్’. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండెపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు.

ముఖ్యంగా తాగునీటి సరఫరా (-7.93%), రవాణా శాఖ పన్నులు (-7.32%), రీ-సర్వే (-7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. “మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు” అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

**నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. “నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను” అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# రత్నాల సిమ గా రాయల రాజధాని..!!







**సోమందేపల్లి, అక్టోబర్ 9 తెలుగు స్వరం:** రాయలసీమను రతనాల సీమగా మార్చడమే రాష్ట్ర ముఖ్యమంత్రి, అపర భగీరథుడు నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం మండలం లోని పందిపర్తి గ్రామ సమీపంలో హెచ్ఎన్ఎస్ఎస్ మడకశిర బ్రాంచ్ కెనాల్ నీటి ప్రవాహ సామర్థ్యాన్ని ప్రస్తుత 408 క్యూసెక్కుల నుంచి 642 క్యూసెక్కులకు పెంచేందుకు రూ.790 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కాంట్రాక్టర్లు ఎస్ ఆర్ కన్స్ట్రక్షన్ రాజగోపాల్ కు

తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని, సాగునీటి సదుపాయాల మెరుగుదలతో రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ కారణంగా కియా పరిశ్రమ ఏర్పాటై వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కంటే రంగులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి విమర్శించారు. గత వైసిపి ఐదు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం రెండున్నర సంవత్సరంలో జరిగిన అభివృద్ధిపై చర్చకి రావడానికి ఎప్పుడైనా సిద్ధమని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలోనా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని వెల్లడించారు. త్వరలో చాలకూరు చెరువుకు కాలువల ద్వారా కృష్ణా జలాలను తీసుకువస్తామని తెలిపారు. మండలంలోని పోలేపల్లి నుండి రాచూపల్లి, మరుకుంటపల్లి రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. గొడ్డలి పార్టీ రఫా రఫా తప్పా అభివృద్ధి అంటే ఏమిటో తెలియని పార్టీ వైసీపీ అని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రికి గిఫ్ట్ గా ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు.




ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, తహసిల్దార్ మారుతి, రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, మండల కన్వీనర్, వెంకటేష్, గోరంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ శైలజ, నాయకులు నిరుగంటి చంద్ర, సిద్ధలింగప్ప, భానుకీర్తి, రామకృష్ణ, సంజీవరెడ్డి, శరత్ రెడ్డి, వడ్డే సూరి, చాకర్లపల్లి శ్రీరాములు, కిష్టప్ప, హరికృష్ణ, జేసీబీ అరవింద్, బోర్ అనీల్, సుధాకర్ రెడ్డి, ఇర్ఫాన్, షైఫుల్లా, శివశంకర్, వడ్డే శివప్ప, పందిపర్తి నాయకులు శ్రీనివాసరెడ్డి, భానుమూర్తి, మాజీ ఎంపీటీసీ మూర్తి, గంగాధర్, నిడి మామిడి, జనసేన పార్టీ మండల కన్వీనర్ జభిఉల్లా, నాయకులు రంగేపల్లి నాగరాజు, కూటమి నాయకులు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ :** ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్ అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీల స్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంత సంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికి సమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు.

## స్థానిక సమరానికి గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

సూచించింది. సర్ ప్రక్రియ పూర్తికాకుంటే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సమర్థించింది. వార్డుల పునర్విభజన అడ్డుకోవడం, ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. . ఇబ్బంది పడేవారికి లేని బాధ మీకెందుకని వైఎస్సార్సీపీ లాయర్?ను కోర్టు నిలదీసింది. ఎన్యూమరేటర్లు, ప్రభుత్వం, కేంద్రం ఎవరికీ లేని నొప్పి మీకెందుకని ప్రశ్నించింది. బీసీ రిజర్వేషన్ల కేసు కొట్టివేత: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 34 శాతం కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను హైకోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం నిరాకరించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక అమలు చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా, ఎక్కడ ఉందని జస్టిస్ దీపాంకర్‌దత్త ధర్మాసనం ప్రశ్నించింది. నివేదిక ఆధారంగా ఫ్యామిలీ డేటాను పరిగణనలోకి తీసుకుంటారని ధర్మాసనం వ్యాఖ్యానించగా, నివేదిక ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహత్గీ వివరించారు. ఫ్యామిలీ డేటాను డెడికేటెడ్ కమిషన్ నుంచి తీసుకున్నట్లు తెలిపారు. నివేదిక ఆమోదం లేకుండా డేటా తీసుకోవడంలో హైకోర్టు కారణం సరిగానే ఉందన్న సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

-మొదటిపేజీ తరువాయి

రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు. ఓవైపు ‘అడవితల్లి బాట’ వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

## వెలిగొండ పూర్తి ఫలాలు అందించేందుకు అడుగులు

-మొదటిపేజీ తరువాయి

వేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రూ.9,081.30 కోట్లకు ఉన్న అంచనా వ్యయాన్ని తాజా పరిస్థితులకు అనుగుణంగా సవరించాల్సి ఉంది. ప్రాజెక్టు మొత్తం వ్యయాన్ని రూ.14,432 కోట్లకు సవరించేలా ప్రతిపాదనలతో వెలిగొండ ప్రాజెక్టు అధికారులు చీఫ్ ఇంజినీర్ల కమిటీకి నివేదిక సమర్పించారు. కమిటీ పరిశీలన అనంతరం ప్రతిపాదన ప్రభుత్వానికి పంపిస్తారు. రెండో దశలో ఉమ్మడి ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలోని 3,28,300 ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చేలా పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**రూ.941 కోట్లతో తొలిదశ ఆయకట్టుకు నీరు**

వెలిగొండ నుంచి నల్లమలసాగర్ జలాశయానికి ఇప్పటికే కొంతమేర నీరు తరలించారు. జలజీవన్ మిషన్ పథకం? కింద చేపట్టిన తాగునీటి సరఫరా ప్రాజెక్టును వేసవి కాలం నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నారు.

తొలిదశలో 1,19,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు, మైనర్లు, ఫీల్డ్ ఛానళ్లు ఏర్పాటు చేయాలి. నల్లమలసాగర్ నుంచి తీగలేరు కాలువ, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువ నీళ్లు తీసుకెళతాయి. ఇందులో తీగలేరు కాలువ 48.30 కిలోమీటర్లకు గాను ఇంకో అర కిలో మీటర్ మేర తవ్వాల్సి ఉంది. కాలువపై 72 కట్టడాలకు 40 నిర్మాణాలు పూర్తయ్యాయి. 62,000 ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే ఈ కాలువ నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీల ఏర్పాటుకు 424.53 ఎకరాలు సేకరించాల్సి ఉంది. గొట్టిపడియ కాలువ నిర్మాణం 11.40 కిలో మీటర్ల మేర పూర్తయింది. కేవలం చిన్న చిన్న పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. తొలిదశలో తూర్పు ప్రధాన కాలువ 44.625 కిలోమీటర్ల దూరం వరకు పరిగణనలోకి వస్తుంది. ఇందులో 44.025 కిలో మీటర్ల మేర తవ్వకం పూర్తయింది. 48 కట్టడాల్లో ఇంకా 30 నిర్మించాల్సి ఉంది. అలాగే 952.18 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. రెండవ దశకు రూ. 1,906 కోట్లు: వెలిగొండ రెండవ దశ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల పరిధిలోని 3,28,300 ఎకరాలకు నీరందించేందుకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో నల్లమలసాగర్ జలాశయం నుంచి ప్రారంభమయ్యే తూర్పు ప్రధాన కాలువ కిందే 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 86 కిలోమీటర్ల మేర పొడవున్న ఈ కాలువలో కేవలం 3 కిలోమీటర్ల మేర తవ్వకం మాత్రమే మిగిలి ఉంది. బ్రాంచి కాలువల విషయానికొస్తే, మొత్తం 244 కిలోమీటర్లలో 31 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. అదనంగా ప్రధాన కాలువపై 75 నిర్మాణాలు, బ్రాంచి కాలువలపై 634 కట్టడాల పనులు చేపట్టాల్సి ఉంది. 60,300 ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న పశ్చిమ బ్రాంచి కాలువలో 30 కట్టడాలు పూర్తి కావాల్సి ఉంది.

## 34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

**రాజమండ్రి :** ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్ధతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలిక కాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటి నిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానిక పదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహా నిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైన వెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు. మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు.

## గర్భవతులకు అన్నదానం



**లేపాక్షి అక్టోబర్ 9** :లేపాక్షి మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో ప్రతివారం జరిగే పరీక్షలకు విచ్చేసే గర్భిణీ మహిళలకు రమామణి చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో,ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు,కరణం రమానందన్ శుక్రవారం దాదాపు 55 మంది మహి ళలకు ఉచితశీగా పౌష్టికాహారం అందజేసే కార్య క్రమం ప్రతివారం లాగే యథావిధిగా నిర్వహించడం జరిగింది.కరణం రమానందన్ వారి తల్లి పేరు మీద మాతృమూర్తులకు(గర్భిణిలకు ) భోజనం ఉచితంగా అందజేయడం నా అదృష్టం అని అయ న సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్య క్రమంలో ఆరోగ్య కేంద్ర డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భిణీ మహిళలు, రమానందన్ మిత్ర మండలి పాల్గొన్నారు.

## అడుగు అడుగున అభివృద్ధికి అడ్డుపడుతున్న వైసీపీ



**సోమందేపల్లి అక్టోబర్ 9** మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో రాష్ట్ర ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ"2024 ఎన్నికల మాదిరి మళ్ళీ స్థానిక ఎన్నికల్లో అదే రిపీట్ అవుతుందేమో"అన్న భయంతో హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో వైసీపీ పార్టీ వారు కేసులు వేశారని "బీసీలకు 34% రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. చట్టపరంగా బీసీలకు న్యాయం చేయలేకపోయినా,పార్టీ పరంగా బీసీలకు న్యాయం చేస్తాం అని. వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి 34% రిజర్వేషన్లను అడ్డుకోవడానికి సాంకేతిక సమస్యలను సృష్టించి బీసీలకు తీరని ద్రోహం చేశారని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం టీడీపీ తరుపున కల్పిస్తామని బీసీల రాజకీయ ఎదుగుదలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగకూడదని గొడ్డలి పార్టీ నేతలు అనేక కుట్రలు చేస్తున్నారు అని. బీసీలకు న్యాయం చేయాలన్నదే టీడీపీ లక్ష్యం అని బీసీల హక్కుల కోసం టీడీపీ నిరంతరం పోరాడుతుందన్నారు. వారి అభ్యున్నతికి కట్టుబడి ఉంటుంది. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే గొడ్డలి పార్టీ చూస్తుంది అని,స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కొట్టివేసిన తెలుగుదేశం పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు న్యాయం చేస్తుందన్నారు. నందమూరి తారక రామారావు 1987లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలిసారిగా బీసీలకు 20%, 1995లో 34% రిజర్వేషన్లు కల్పించారని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్ళీ 2024లో వైసీపీ పార్టీకి మళ్ళీ అదే సీన్ రిపీట్ అవుతుంది అని, బీసీలకు 34% రిజర్వేషన్లను పార్టీ నుంచి ఇచ్చి బడుగు బలహీనవర్గాల రాజకీయ అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు.

## సబ్సిడీతో గడ్డి కత్తిరించే పరికరాలు పంపిణీ



**మడకశిర అక్టోబర్ 9** నియోజకవర్గం రొల్ల మండల కేంద్రం లోని పశు వైద్యశాలలో శుక్రవారం గడ్డి కత్తిరించే పరికరాలు పంపిణీ చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ పశు వర్ధక శాఖ ఏడి అమర్ రైతులకు పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఈరన్న, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, ఏపీఐఏసీ డైరెక్టర్ రామకృష్ణ, మార్కెట్ యాడ్ చైర్మన్ బిఎస్ గురుమూర్తి, బీసీ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ వి ఎం పాండురంగప్ప, క్లస్టర్ కో కన్వీనర్ మారుతి ప్రసాద్, సింగల్ విండో డైరెక్టర్ భరత్, రేవన్నా, ఫీల్డ్ అసిస్టెంట్ మూర్తి, పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి..

మంత్రి సత్య కుమార్ యాదవ్




**ధర్మవరం అక్టోబర్ 09** : ధర్మవరం నియోజకవర్గ యువతీ యువకులకు దేశ సేవ పట్ల ఆసక్తిని పెంపొందించి ఆర్మీ పోలీస్ పారా మిలిటరీ దళాల్లో ఉద్యోగ అవకాశాలు సాధించేలా ప్రోత్సహించేందుకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిరుద్యోగులకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి సౌజన్యంతో, సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో, ఎస్వీ డిఫెన్స్ అకాడమీ తిరుపతి సహకారంతో ఈ శిక్షణ ఇవ్వబడుతోందని తెలిపారు. ఫిజికల్ ఫిట్నెస్ రన్నింగ్ ఫిజికల్ టెస్టులలో నిపుణుల మార్గ దర్శకత్వం కూడా లభిస్తుందని తెలిపారు. ఇటువంటి అవకాశం ధర్మవరం పట్టణంలోని తారకరామాపురంలో గల కె హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామని ఈ శిక్షణకు అక్టోబర్ 12 వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. కావున యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దేశ రక్షణలో భాగస్వాములు కావాలని వారి విజ్ఞప్తి చేశారు.

## భగవద్గీత బోధనలు.. సాంస్కృతిక శిక్షణ.. విద్యార్థులకు ఇస్కాన్ దసరా కానుక



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 9, :** విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావనలు, నైతిక విలువలు, భారతీయ సంస్కృతిపై అవగాహన పెంపొందించేందుకు ప్రొద్దుటూరులోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో 'గోపాల్-ఇ-స్కూల్' దసరా కల్చరల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ మందిరంలో శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 1 నుంచి 5వ తరగతి, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రెండు విభాగాలుగా శిక్షణ ఇస్తామని తెలిపారు. మంత్ర ధ్యానం, భగవద్గీత శ్లోకాలు, నీతి బోధనలు, ఆటలు, నృత్యం వంటి అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. శిబిరంలో పాల్గొనే ప్రతి విద్యార్థికి ఆధ్యాత్మిక కానుకతో పాటు కోర్సు పూర్తిచేసిన ధ్రువీకరణ పత్రం అందజేస్తామని తెలిపారు. ప్రవేశ రుసుము రూ.500గా నిర్ణయించినట్లు వెల్లడించారు. అక్టోబర్ 20న భగవద్గీత శ్లోకాలు, బహుళైచ్ఛిక ప్రశ్నలతో 50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెండు విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.6,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.1,000తో పాటు మరో పది ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. అక్టోబర్ 25న విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం 8520027510, 6303474393, 9912266036 నంబర్లను సంప్రదించాలని ఇస్కాన్ ప్రతినిధులు కోరారు.

## జనసేన నిర్వాహక్ దళ్ బృందంలో వీర మహిళ రాయల్



**సోమందేపల్లి అక్టోబర్ 9 సీమ వార్త** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా హిందూపురం పార్లమెంట్ స్థాయిలో 32 మంది సభ్యులతో కూడిన నిర్వాహక్ దళ్ బృందంలో సోమందేపల్లి కి చెందిన సుమిత్ర రాయల్ కు సభ్యురాలుగా స్థానం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు టి.సి. వరుణ్ హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, చిలకం మధుసూదన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులందరికీ, వీర మహిళలకు మరియు జనసైనికులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఈ బాధ్యతను ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నానన్నారు.జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తూ పార్టీ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.పార్టీ అభివృద్ధి కోసం ప్రతి జనసైనికుడితో కలిసి, ఐకమత్యంతో ముందుకు సాగుతూ జనసేన పార్టీ విజయ ప్రస్థానంలో నా వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కమిటీల ఏర్పాటు

**ఆలూరు నియోజకవర్గం నుంచి కర్నూలు జిల్లా సమన్వయ కమిటీలో ఐదుగురికి చోటు**

**ఆలూరు, అక్టోబర్ 9 :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో




సిద్ధం చేసే లక్ష్యంతో పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు క్షేత్రస్థాయిలో పార్టీ సంస్థాగత పరిస్థితి, నాయకులు, జనసైనికుల పనితీరు, స్థానిక రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న ఆశావహుల వివరాలు, కూటమి సమన్వయం వంటి అంశాలపై సమాచారాన్ని సేకరించి నివేదికలు రూపొందించనున్నాయి. క్షేత్రస్థాయి కమిటీలు అందించే నివేదికలను స్థానిక సంస్థల ఎన్నికల కోఆర్డినేషన్ కేంద్ర కమిటీ సమీక్షించి, ప్రత్యేక నివేదికల రూపంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారికి అందజేయనుంది. కమిటీల పనితీరును ఆయన స్వయంగా పర్యవేక్షించడంతో పాటు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కమిటీ సభ్యులతో సమావేశమై ఎన్నికల సన్నద్ధత, పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయం కోసం ఎన్నికల నిర్వహణ, మార్గదర్శక కమిటీ, కూటమి సమన్వయ కమిటీ, ప్రచార కమిటీ, ట్రెజరీ కమిటీలను కూడా జనసేన పార్టీ ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ కమిటీలు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో కర్నూలు జిల్లా సమన్వయ కమిటీలో ఆలూరు నియోజకవర్గం నుంచి ఐదుగురికి అవకాశం లభించింది. బోయ సరోజ, అరవింద్ కుమార్ యాదవ్, బోయ రంజిత్, గాజుల జగదీష్, ఉసేని ఈ కమిటీలో సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన సభ్యులకు ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి శ్రీ తెర్నేకల్ వెంకప్ప గారు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయడం, ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ దృష్టికి తీసుకురావడం, కూటమి నాయకుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ఈ కమిటీల ప్రధాన లక్ష్యం.

## ఉత్తరాల మౌనం.. తపాలా సేవల ప్రస్థానం..

-మొదటిపేజీ తరువాయి

అనుగుణంగా ముందుకు సాగుతోంది. స్పీడ్ పోస్ట్, రిజిస్టర్డ్ పోస్టు, పార్శిల్ సేవలు, ఈ-కామర్స్ వస్తువుల పంపిణీ వంటి సేవల ద్వారా ప్రజలకు చేరువవుతోంది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ సంప్రదాయ సేవలకు కొత్త రూపునిస్తోంది. ప్రభుత్వ సేవలు, ఆర్థిక లావాదేవీలు, పొదుపు పథకాలు, బీమా సేవల ద్వారా కూడా ప్రజలకు ఉపయోగపడుతోంది.

**గ్రామీణ ప్రజలకు నమ్మకమైన సేవలు..**

భారతదేశంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో తపాలా శాఖ పాత్ర ఎంతో కీలకం. మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు బ్యాంకింగ్, పొదుపు, బీమా, నగదు బదిలీ వంటి సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో తపాలా వ్యవస్థ తోడ్పడుతోంది. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ వంటి సేవలతో డిజిటల్ ఆర్థిక లావాదేవీలను గ్రామీణ ప్రజలకు మరింత చేరువ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రత్యేకించి వృద్ధులు, పెన్షనర్లు, రైతులు, మహిళలు, మారుమూల ప్రాంతాల ప్రజలకు తపాలా శాఖ అందించే సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి. డిజిటల్ సౌకర్యాలు అందరికీ సమానంగా అందుబాటులో లేని పరిస్థితుల్లో, ప్రజలకు నేరుగా సేవలందించే వ్యవస్థగా తపాలా శాఖ ప్రాధాన్యం కొనసాగుతోంది.

**ఉత్తరం వెనుక ఉన్న మధురానుభూతి..**

నేటి తరానికి ఉత్తరం రాయడం, తపాలా పెట్టెలో వేయడం వంటి అనుభవాలు అరుదుగా మారిపోయాయి. ఒకప్పుడు ప్రియమైన వారి నుంచి ఉత్తరం వస్తే దానిని పదేపదే చదువుకుంటూ ఆనందపడేవారు. ఆ ఉత్తరాన్ని భద్రంగా దాచుకుని, ఎన్నో ఏళ్ల తర్వాత కూడా జ్ఞాపకంగా చూసుకునేవారు. అక్షరాల్లో పలికిన ఆప్యాయత, కాగితంపై ఒలికిన భావోద్వేగం, సమాధానం కోసం ఎదురుచూసే ఆత్రుత.. ఇవన్నీ తపాలా వ్యవస్థతో ముడిపడిన మధుర జ్ఞాపకాలు.

సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, ఆత్మీయతను అక్షరాల్లో నింపి పంపే ఉత్తరానికి ఉండే ప్రత్యేకతను మరచిపోలేం. అందుకే తపాలా శాఖ అనేది కేవలం ఉత్తరాలను చేరవేసే వ్యవస్థ మాత్రమే కాదు.. మనుషుల మధ్య అనుబంధాలను పెంపొందించిన ఒక చారిత్రక వారధి.

**సేవే లక్ష్యంగా.. భవిష్యత్తు వైపు అడుగులు!**

జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా తపాలా శాఖ అందిస్తున్న సేవలను గుర్తుచేసుకోవడంతోపాటు, మారుతున్న కాలానికి అనుగుణంగా ఆ శాఖ మరింత ఆధునికంగా, ప్రజలకు చేరువగా ఎదగాల్సిన అవసరం ఉంది. డిజిటల్ సేవల విస్తరణ, వేగవంతమైన పార్శిల్ పంపిణీ, మెరుగైన ఆర్థిక సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతమైన సేవలందించడం వంటి అంశాలు భవిష్యత్తులో కీలకం కానున్నాయి.

ఒకప్పుడు మనసులోని మాటను కాగితంపై మోసుకొచ్చిన తపాలా బంట్రోతు.. నేడు ఆధునిక సాంకేతికతతో ప్రజల అవసరాలను చేరవేస్తున్న సేవా ప్రతినిధిగా మారుతున్నాడు. కాలం మారినా, పద్ధతులు మారినా ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యం మాత్రం మారలేదు. ఉత్తరాల యుగం నుంచి డిజిటల్ యుగం వరకు సాగుతున్న తపాలా ప్రస్థానం.. భారత ప్రజాజీవనంలో చెరగని అధ్యాయం. నమ్మకానికి చిరునామాగా, సేవకు ప్రతిరూపంగా తపాలా శాఖ మరింత ముందుకు సాగాలని జాతీయ తపాలా దినోత్సవం ఆకాంక్షిస్తోంది.

## రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం..!!

-మొదటిపేజీ తరువాయి

వచ్చిన తరవాత బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి.. 10 శాతం మేర కోత విధించారన్నారు. దీనివల్ల బీసీలు చివరిసారిగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 16,800 పదవులు కోల్పోయారని మంత్రిసవిత ఆవేదన వ్యక్తంచేశారు.

**బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న జగన్**

బీసీలకు జనాభా ప్రాతిపదికన పదవులు దక్కాలన్నది సీఎంచంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగానే బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని నిర్ణయించారన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగడం ఇష్టంలేని జగన్ హైకోర్టుకెళ్లి బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిల్ దాఖలు చేశారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు తీర్పుఇవ్వడంతో, సుప్రీం కోర్టును ఆశ్రయించామన్నారు. టీడీపీకి చెందిన కేంద్రమంత్రి రామ్మోహననాయుడు, రాష్ట్రానికి చెందిన మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో చర్చించారన్నారు. చిట్టచివరి వరకూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనకు చిత్తశుద్ధితో న్యాయ పోరాటం చేశామని మంత్రి సవిత వెల్లడించారు..

**పార్టీపరంగా 34 శాతం రిజర్వేషన్లు**

సుప్రీం కోర్టులోనూ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పురావడం బాధాకరమని, దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పును శిరసావహిస్తామని మంత్రి సవిత తెలిపారు. కోర్టులు కొట్టేసినా బీసీలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని స్పష్టంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి తరఫున 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని తెలిపారు. బీసీల బాగుకోరే ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడని తెలిపారు. చరిత్రలో ఎరుగని విధంగా బడ్జెట్ లో బీసీల కోసం అత్యధిక నిధులు కేటాయించామన్నారు. బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పార్కుల్లో అవకాశమిస్తున్నామన్నారు. అన్ని బీసీ కులాలకు ఆర్థిక మేలు కలిగేలా పథకాలు, అభివృద్ధికార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు పదవులు దక్కాలన్నది తమ లక్ష్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు.

## బీసీలకు అన్యాయం చేసిన జగన్..!!



-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

బీసీ సోదరులు తమ హక్కుల కోసం ఐక్యంగా నిలవాలని, గత ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, బీసీలకు జరిగిన అన్యాయంపై రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన రాజకీయ సమాధానం చెప్పాలని పేర్కొన్నారు.

బీసీల అభివృద్ధి మా నినాదం.బీసీలకు రాజకీయ న్యాయం మాలక్ష్యం..బీసీల ఆత్మగౌరవ పరిరక్షణే మా లక్ష్మ స్పష్టం చేశారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A5612 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881